

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**మెండోరా మండలం పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.సామ్ కోషి, జస్టిస్ సృజన శనివారం సందర్శించారు. పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాలో పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం హైకోర్టు జడ్జీలు కలెక్టర్‌తో భేటీ అయి ఎస్సారెస్పీ ప్రాజెక్టుపై జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

## రైతాంగ పోరాట యోధులను స్మరించాలి



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల వార్షికోత్సవాల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు తక్షణమే జరపాలని సిపిఐ తెలంగాణ కంట్రోల్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. శనివారం రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరిస్తూ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పోరాటాలకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉండాలని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఏకపక్ష నరమేధాన్ని ఆపాలని, ప్రపంచ కార్మిక వర్గ దృక్పథాన్ని అర్థం చేసుకుని అన్ని కమ్యూనిస్టు పార్టీలు మావోయిస్టు పార్టీతో కలిసి ప్రజాస్వామిక పోరాటాల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నరసయ్య, పట్టణ పార్టీ కార్యదర్శి ఆడపు రాజమౌళి, బొంకూరి రామ్ చందర్, శనిగారపు రాజేంద్ర, బికెయంయు జిల్లా కార్యదర్శి మాణిక్యం, బొల్లం తిలక్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, సీనియర్ నాయకులుపాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై ఎఐటియుసి గర్జన



**ప్రజాపక్షం/ మందమర్రి:**యాజమాన్యం మొండి వైఖరిని విడనాడకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని ఎఐటియుసి నేత శైలేంద్ర సత్యనారాయణ హెచ్చరించారు. మందమర్రి ఏరియా కెకె 5 గనిలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఫిట్ సెక్రటరీ గాండ్ల సంపత్ అధ్యక్షతన శనివారం గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా శైలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ సొంతింటి పథకం, పెరిక్స్ పై ఇన్‌కం టాక్స్ మినహాయింపు, మారు పేర్ల సమస్యలు, లాభాల వాటా 35 శాతం ఇవ్వాలని యాజమాన్యాన్ని పదేపదే కోరుతున్నప్పటికీ కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారని తీవ్ర అవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులకు సూటబుల్ జాబ్స్ ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు మాట్లాడుతూ కెకె 5 గని మేనేజర్ వేధింపులకు పాల్పడుతున్నారని, సపోర్ట్ మెన్‌పై అదనపు పని భారం మోపుతున్నారని, ఒక్క రోజు గైర్హాజరు అయినా నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. అధికారులు ఇలాంటి విధానాలు మానకపోతే తీవ్ర ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/వేమనపల్లి/మంచిర్యాల** :తెలంగాణ రైతాంగ సాయుధ పోరా ట వారోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జయప్రదం చేయాల ని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు ల క్ష్మణ్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వేమనపల్లిలో జరిగిన పోరాట 77వ వార్షికోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి కోసం నిజాం నవాబులకు, జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్రను, అమరవీరుల త్యాగాలను నేటి సమాజానికి తెలిసేలా గ్రామస్థాయి నుంచి పట్టణ, మండల కేంద్రాల వరకు సదస్సులు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగే ముగింపు సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల దాస్, నేషనల్ హెల్త్‌స్కీం జిల్లా కార్యదర్శి దేవనబోయిన బాపు తదితరులు పాల్గొన్నారు.

## కోఠి కమిషనరేట్ ఆఫ్ హెల్త్ కార్యాయలం ముందు 15న ధర్నా

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎంఎ రహమాన్

**ప్రజాపక్షం/సదాశివపేట:** ఎఐటియుసి సదాశివపేట ఎఎన్‌ఎంల పనిభారాన్ని తగ్గించాలని కోటిలోని కమీషనరేట్ ఆఫ్ హెల్త్ కారాయలయం ముందు ఈ నెల 15 న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆత్మకూర్ గ్రామం సదాశివపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గోడ పత్రిక విడుదల చేసిఅంటించడం జరిగింది. ఈ సందర్భంగాఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎంఎ రహమాన్ మాట్లాడుతూ ప్రభుత్వం , వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వం ఎఎన్‌ఎంలపై పని భారం మోపడం సరికాదన్నారు. ఎఎన్‌ఎంలు రోజుకు 14 గంటల డ్యూటీ చేయాల్సివస్తుందన్నారు .అలా చేయడం ద్వారా వారు బిపి షుగర్ స్పాండలైసిస్ లాంటి దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో మెడికల్ అండ్ హెల్త్ కమీషనరేట్ కోటి కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయండి

### సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ జిల్లా క లెక్టర్ ప్రావీణ్యను కోరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కా ర్యాలయంలోని కలెక్టర్ ప్రావీణ్యకు కొండాపూర్ రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, అలియా బాద్, మారేపల్లి, గంగారం, శివన్న గూడెం, రాంపూర్, తండా గ్రామ పరిధిలో నిరుపేద రైతులు కోల్పోతున్న భూములపై జీవనం కొనసా గి స్తున్నారు. పట్టా భూములు ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు మరమ్మతులో కోల్పోకు ం డా నిరు పేద రైతులను కాపాడాలని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తెలిపారు. రైతుల మంచి కోరే ప్రభుత్వం రోడ్డున పడేసి ఆర్‌ఆర్‌ఆర్ ఏర్పాటు చేయ దంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులను సంతృప్తి చేసే విధం గా ఆర్‌ఆర్‌ఆర్ విధానాలు ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్ర మంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడవి బిడ్డల ఆక్రందన...

# అధికారుల నిరంకుశత్వం

### అదివాసీ మహిళలను అరెస్ట్ చేసిన అటవీ శాఖ అధికారులు





**ప్రజాపక్షం / దండేపల్లి / మంచిర్యాల :**అడవుల్లో సాగు చేసుకుంటున్న ఆదివాసీల గుడిసెలు, పంటలను తొలగించేందుకు దండేపల్లి మండలం లింగాపూర్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు శనివారం భారీ ఆపరేషన్ చేపట్టారు. వందలాది మంది అటవీ సిబ్బంది, ఆరు జెసిబి యంత్రాలతో అడవిలోకి ప్రవేశించగా, ఆదివాసీల మహిళలు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో 14 మంది ఆదివాసీ మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. లింగాపూర్ గ్రామ శివారులోని అటవీ భూమిలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్నారు. ఈ భూములను అటవీ శాఖకు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రణాళిక రచించారు. శుక్రవారం కారంపొడి దాడి చేశారన్న ఆరోపణలతో అటవీ శాఖ సిబ్బంది కేసు నమోదు చేయగా, దీనిని ఆదివాసీలు ఖండించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వందలాదిగా అటవీ సిబ్బంది అడవిలోకి ప్రవేశించారు. జెసిబిలతో గుంతలు తవ్వేందుకు ప్రయత్నించగా, మహిళలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు 14 మంది మహిళలను అరెస్టు చేసి దండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జన్నారం ఎఫ్‌డిఒ రామ్మోహన్ రావు మాట్లాడుతూ రెండు నెలలుగా ఆదివాసీలకు అటవీ భూముల పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సైతం వారికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చినా, వారి వైఖరిలో మార్పు రాలేదన్నారు. విధులు నిర్వర్తిస్తున్న తమ సిబ్బందిపై శుక్రవారం మహిళలు దా డి చేసినా తాము సహనం పాటించామని వివరించారు.

**మీడియాను అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు**

సంఘటనను కవరేజ్ చేయడానికి వెళ్ళిన మీడియాను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అటవీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్టులు, అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛను హరించడం నేరం అని, జరుగుతున్న ఘటనను కవరేజ్ చేయడానికి వచ్చిన విలేకరులను అనుమతించపోవడం అమానుషం అని వారు మండిపడ్డారు. కాగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండానే వెనుదిరిగారు.

## కోర్టు కేసుల పరిష్కారం కోసం
# జాతీయ లోక్‌అదాలత్ ఒక గొప్ప అవకాశం

### రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్..



**ప్రజాపక్షం/నిర్మల్:**కోర్టు కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశం అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోశి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని పెంచనర్ల భవనంలో జరిగిన మూడవ జాతీయ లోక్ అదాలత్ సేవల,కమ్యూనిటీ మీడియేషన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ,కోర్టు కేసుల్లో రాజీ మార్గాల ద్వారా ఇ రు వర్గాలకూ న్యాయం చేకూరుతుందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంతో పాటు కక్షిదారు లు ప్రశాంతంగా జీవించవచ్చని సూచించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి సుజన కళాసికం మాట్లాడుతూ,ఏళ్లుగా పెం డింగ్‌లో ఉన్న కేసులకు లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోంది.వరకట్నం,గృహహింస,చె క్ బౌన్స్,రోడ్డు ప్రమాదాలు వంటి కేసులు తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చు అని పేర్కొన్నారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ .శ్రీవాణి మాట్లాడుతూ,న్యాయవాదులు ప్ర జలకు లోక్ అదాలత్ గురించి అవగాహన కలిపించి,వారిని కేసులను రాజీమార్గంలో ప రిష్కరించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.క్రిమినల్,సివిల్ కేసులు,భూ వివాదాలు,కుటుంబ తగాదాలు,ఆస్తి గొడవలు తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,లోక్ అదాలత్ సేవలు కోర్టులపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపుతున్నాయి.దేశవ్యాప్తం గా లక్షలాది కేసులు ఈ విధానం ద్వారా సులభంగా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.పలు కేసుల్లో బాధితులకు మంజూరైన నష్టపరిహార చెక్కులు,అటవీ జంతువుల దాడిలో నష్టపోయిన వారికి పరిహార చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు పంచాక్షరి,డిఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ రాధిక,ఎస్పీ జానకి షర్మిల ,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి,కోర్టు అధికారులు,న్యాయవాదులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గుండెకోత.. జలమయమైన పంట పొలాలు



**ప్రజాపక్షం/మందమర్రి** :మందమర్రి మం డలం పొన్నారం గ్రామంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం రైతులను తీవ్రంగా దె బ్బతీసింది. నెలల తరబడి కష్టపడి సాగు చే సిన పంటలు నీటిలో మునిగిపోవడంతో అ న్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రా మంలోకి వర్షపు నీరు భారీగా చేరి, పొలాలన్నీ జలమయమయ్యాయి. అప్పులు చేసి విత్తనాలు వేసి, ఆశగా ఎదురుచూసిన పం టలు క్షణాల్లో నాశనమైపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొ లాలను చూసి గుండెల్లో దిగులు నిండి, ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. రైతుల ఆవేదన వ్యక్తం చేస్తూ.. మా కష్టానికి ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి, నష్టపోయిన పంటలకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలి అని కోరుతున్నారు. పంట పొలాలతో పాటు, విద్యుత్ స్తంభాలు కూడా కూలిపోవడంతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. కన్నీటి లోయలైన పొలాలను చూసి రైతులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామ ప్రజలు, రైతు స ం ఘాలు వెంటనే నష్టపరిహారం, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## బిజెపి టికెట్ కోసం అన్ని పార్టీల నాయకుల క్యూ

### పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులకు సముచిత స్థానం: ఎంపి



**ప్రజాపక్షం/నిజామాబాద్:**బిజెపిటికెట్ కోసం అన్ని పార్టీల నాయకులు క్యూ కడుతున్నారని పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం ఇవ్వటంతో పాటు గెలుపు గుర్రాలకే టికెట్ ఇస్తామని జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారంబిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన సేవా పక్షం జిల్లా కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలువదని స్వయంగా క్యాడరే ఫోన్స్ చేస్తున్నారని కాంగ్రెస్‌ను నమ్మె పరిస్థితి లేదని, మాకు బిజెపి టికెట్ ఇవ్వండని మొరపెట్టుకుంటున్నారన్నారు. కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కష్టపడి పని చేయిన ప్రతిఒక్కరికి సముచిత న్యాయం జరిగేలా చూస్తామన్నారు. పిఎం మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని స్వచ్ఛభారత్ డిజిటల్ ఇండియా, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు ప్రతి రంగంలో బిజెపిప్రభుత్వమే కృషి చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, సేవ భావంతో ప్రతి ఇంటికిబిజెపిసిద్ధాంతాలను తీసుకెళ్లాలన్నారు. సేవా పక్షంలో భాగంగా ప్రతి బూత్ స్థాయిలో కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీ నారాయణ, న్యాలం రాజు, ఉపాధ్యక్షులు రాంచందర్, పాలెపు రాజు, న ర్సారెడ్డి, జిల్లా,నగర మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** దివ్యాంగులకు, ఆసరా పెన్షన్ దారులకు పెన్షన్ డబ్బులు వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యాక్షులు శివన్నగారి ఎల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల సంఘ ం మండల అధ్యక్షులు బాసంపల్లి స్వామిగౌడ్, ఎ మ్మార్పీఎస్ మండల కన్వీనర్ కుమార్, అధికార ప్రతినిధి అంబిగారి నర్సింలుతో కలసి శనివారం శివ్వంపేటలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లేశ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ. 6వేలు, ఆసరా పెన్షన్ దారులకు రూ. 4కవేలు అందిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా అమలు చేయకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగుల పెన్షన్లు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వృద్ధాప్య పించన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఈ నెల 15న మండల తహశీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికి పెంచన్లు ఇవ్వాలని అన్నారు. ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన తహశీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి మండలంలోని అన్ని రకాల పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## డైలీ వేజ్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ హెచ్చరించారు. శనివారం ఆసిఫాబాద్‌లో జెఎసి ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో పాల్గొని ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కష్టాలు పడుతున్న కార్మికులకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 212 జిఒ సవరిస్తూ ఐదు సంవత్సరాలు సేవ చేసిన వారిని పర్మినెంట్ చేయాలని, మిగతావారికి టైమ్ స్కేల్ ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ, 25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ట్రెజరీల ద్వారా వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాలు కల్పించాలని తెలిపారు. వారాంతపు సెలవులు, యూనిఫారాలు, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :**కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా గ్రూ పులలో మిగిలి సిట్లకు ఈనెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె. శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు డిగ్రీలో చేరని విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హా జ రు కావాలన్నారు. ఆయా విభాగాలలో మిగిలిన సీట్లను నిబంధనల మేరకు రిజర్వేషన్ కంమెరిట్ ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్ తీసుకున్న వి ద్యార్థులు ఎలాంటి ఉపకార వేతనాలకు అర్హులు కారని, వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. వి ద్యార్థులు పదో తరగతి మెమో, ఇంటర్ మెమో, టిసి స్టడి సర్టిఫికెట్లతో పాటు ఒకేషన ల్ విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం సమర్పించాలని సూచించారు.

## చాప కింద నీరులా మళ్లీ 'బిట్‌కాయిన్' దందా



**ప్రజాపక్షం/నిర్మల్ :**నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గతంలో సంచలనం సృష్టించిన బిట్‌కాయిన్ మళ్లీ చాప కింద నీరులా వ్యాపిస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నా యి.రెండు మూడు సంవత్సరాల క్రితం బిట్‌కాయిన్ పే రుతో పెట్టుబడులు పెట్టించి భారీ లాభాలు వస్తాయని ఆకట్టుకున్న మోసగాళ్లు చివరికి లక్షల రూపాయల న ష్టం కలిగించిన విషయం తెలిసిందే.ఆ తరువాత పెద్దగా ఎవరు ఈ దందా గురించి మాట్లాడకపోయినా,ఇప్పుడు మళ్లీ నిదానంగా అదే వ్యాపారం పునరుజ్జీవం పొందుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి.

**బాధితులు మౌనంగా...**

బిట్‌కాయిన్ పేరుతో మోసపోయిన బాధితులు ఈరోజు కి కూడా బహిరంగంగా మాట్లాడేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది.సమాజంలో అవమానం, డ బ్బులు తిరిగి వస్తాయనే ఆశ,పోలీసులకు సమాచారం ఇస్తే సమస్యలు వస్తాయనే భయం వీరిని మౌనంగా ఉం చుతోందని సమాచారం.కొందరు వ్యక్తులు లక్షలు పెట్టుబడి పెట్టినా ఒక్కపైసా కూడా తిరిగి రాకపోవడంతో తీ వ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక వ ర్గాలు చెబుతున్నాయి.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారు ఇప్పుడు ఆ డబ్బులు తిరిగి చెల్లించలేక ఇబ్బందు లు పడుతున్నారని కూడా తెలుస్తోంది.

**అంతర్గత చర్చలు,కేసులు పెట్టే సన్నాహాలు..**

ఇప్పటివరకు వేచి చూసిన బాధితులు ఇక మౌనంగా ఉ ండబోమన్న సంకేతా లు వస్తున్నాయి.డబ్బులు తిరిగి వ చ్చే అవకాశం లేకపోవడంతో,పోలీస్ కేసులు పెట్టి అయి నా వసూలు చేసుకుందామన్న ఆలోచనలో ఉన్నారని స మాచారం. ఇప్పటికే కొందరు బాధితులు రహస్యంగా క లిసి,ముందుకు ఎలా వెళ్లాలన్నదాని గురించి చర్చలు జ రుపుతున్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

**అక్రమ వ్యాపారం ఇంకా కొనసాగుతుందా..**

జిల్లా వ్యాప్తంగా బిట్‌కాయిన్ అక్రమ వ్యాపారం పూర్తి గా అంతరించి పోలేదనే అనుమానాలు వ్యక్తమవుతునా ్నయి.తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుం ది.ప్రతీవారం డబ్బులు రెట్టింపు అవుతాయి.అంటూ కొత్తగా కొందరిని ఆకర్షిస్తున్నారని సమాచారం.పైపైకి ఎలాంటి పెద్ద స్థాయిలో బహిరంగ ప్రకటనలు లేకపోయినా,రహస్యంగా నెట్‌వర్క్ పద్ధతిలో కొత్త బాధితులను వలలోకి తీసుకుంటున్నారని తెలుస్తోంది.

**అధికారుల దృష్టికి రావాలా...**

ఇప్పటివరకు చాలా మంది భయంతో లేదా సంకోచంతో అధికారులనుఆశ్రయించకపోవడంతో,బిట్‌కాయిన్ మో సగాళ్లు మరింత దుస్సాహసంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.బాధితులు బహిరంగంగా ముందుకు వస్తేనే ఈ అక్రమ దందా ఆగుతుంది అని ని పుణులు సూచిస్తున్నారు.పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉ ండాలని,చట్టపరమైన చర్యలు తప్పక తీసుకోవాలని విజ్ఞులు సూచిస్తున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్.సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దయానంద్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**కామారెడ్డి జిల్లాలో ఎస్.సి కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.దయానంద్ బదిలీపై నిర్మల్ జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి(డిఎస్‌సిడిఓ)గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి,పూల మొక్కను అందజేశారు.దయానంద్ కు శుభాకాంక్షలు తెలియజేసిన కలెక్టర్,క్రమశిక్షణతో పనిచేస్తూ,షెడ్యూలు కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి,మరింత మందికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు,తదితరులు ఉన్నారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గల్ఫ్‌కార్మికులను ఆదుకోవాలి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ప్రజాప్రభుత్వం గల్ఫ్ భాధితులను ఆదుకోవాలని మండలంలోని రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ వద్ద గల్ఫ్ శ్రామికుల గద్దెవద్ద మండల సొసైటి అద్యక్షులు ఎండి లాల్‌మహమ్మద్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బ్లాక్ కాంగ్రెస్ దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు.ప్రభుత్వం గల్ఫ్‌కార్మికులను ఆదుకుంటుందని హామిఇచ్చారు.భాధితులకు ఎలాంటి ప్రమాదానికి గురైనా తెలంగాణాలో ఐదు లక్షల భీమాను అందచుయడం జరుగుతుందని అన్నారు.ఎక్కువగా కోరుట్ల,మెట్‌పల్లి,నిజామాబాద్,జగిత్యాల,సిరిసిల్లా ప్రాంతాలనుండి విదేశాలకు బతుకుదెరువు కోసం వెళతారని చెప్పారు,నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు.గల్ఫ్ భాదితుల సమస్యలను ప్రభుత్వ విప్‌ను ఆదిశ్రీనివాస్‌ను పంపించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో గల్ఫ్ భాదితుల ఉపాద్యక్షులు సుదామల్ల శ్రీనివాస్,సివిల్ ప్రొటెక్షన్ జిల్లా అద్యక్షులు శ్రీకాంత్ రెడ్డి.ప్రజాప్రతినిధులు రాంరెడ్డి,దొమ్మట నర్సయ్య,లక్ష్మారెడ్డి,షేక్‌గౌస్,మర్రి శ్రీనివాస్,సంజీవరెడ్డి నాయకులు జెండా ఆవిష్కరణలో ఉన్నారు.

## గ్రూప్ 2 ఫలితాల సర్వీసెస్‌ని కేటాయించి అపాయింట్మెంట్ పత్రాలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రూప్ 2 ఫలితాలు వెల్లడించి ఆరు నెలలు కావస్తున్నాయని వెంటనే సర్వీసెస్ నీ కేటాయించి అపాయింట్మెంట్ పత్రాలు అందజేయాలని గ్రూప్ 2 సాధించిన అభ్యర్థులు రాష్ట్ర యువజన నాయకుడు గోమాస సచిన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లో మంత్రి కార్యాలయంలో మంత్రి డి.శ్రీధర్ బాబుని కలవడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి అతి త్వరలో అపాయింట్మెంట్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందిస్తామని హామీ ఇచ్చారని గ్రూప్ 2 అభ్యర్థులు తెలిపారు. అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి శ్రీధర్ బాబు కి ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్ గ్రామంలో గత వారం రోజుల క్రితం ప్రతాప్‌రెడ్డి తల్లి మృతి చెందిన విషయం విధితమే. కాగా ఈ సమాచారం తెలుసుకున్న ఎంపి ఈటల రాజేందర్ శనివారం వారి స్వగృహానికి చేరుకోని మృతిరాలు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించిన అనంతరం ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, జగదేవ్‌పూర్ మండల నాయకులు బుద్ధ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** దళితులకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు అయ్యేటట్లు చూడాలని మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను దళిత శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం నేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేస్తే దళితులకు న్యాయం జరుగుతుందని, ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు అందేలా చూడాలని విన్నవించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికి తెలంగాణలోని దళిత సమాజానికి ఇచ్చిన హామీలు రిజర్వేషన్ల పెంపు, అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు కావడంలేదని ఎమ్మెల్యేకు సన్ని, రవి వివరించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుపోయి చేవెళ్ళ డిక్లరేషన్ అమలు అయ్యేట్లు చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండల కేంద్రానికి చెందిన తాళ్ల కార్తీక్ (19) అనే యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వివరాల్లోకి వెళితే తాళ్ల కార్తీక్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడు తుండేవాడు. గతంలో ఓసారి డిష్ వైర్‌తో ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి బ్రతికించారు. ఈ నెల 12న కార్తీక్ పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసుకున్న తర్వాత కార్తీక్ అతిగా మద్యం సేవించి గొడవపెట్టుకుంటూ ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ బెదిరించాడు. రాత్రి అందరూ పడుకున్న అనంతరం ఉదయం 4 గంటలకు లేచి చూసేసరికి కార్తీక్ ఇంట్లో గదిలో మరణించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్‌రావు వైద్య బృందం కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు

**ప్రజాపక్షం/కోరుట్ల:** డిగ్రీలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా షెడ్యుల్ విడుదల చేసిందని కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్, అకాడమిక్ కో ఆర్టినేటర్ ఏ.లక్ష్మణ్ క ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బిఏ బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ సీట్లు ఖాళీగా ఉన్నాయని కోర్స్‌వారికి క్యాటగిరి వైజ్‌గా దోస్త్ స్పాట్ అడ్మిషన్లు ఈనెల 15, 16 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సామాన్యులే సాయుధులై..

## పోరాట స్మృతి చిహ్నాలను కాపాడాలి



సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యునిస్టుల పాత్ర గొప్పదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించి పోరాటం కొనసాగించారని చరిత్రను లిఖించదగ్గ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తే గుణపాఠం తప్పదని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాల 77వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని సీపీఐ శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెళ్ళిలో ఆ పార్టీ సాయుధ పోరాటంలో అమరులైన వేముల నర్సింహ్ములు, చీకట్ల ముత్తయ్యల స్మారక స్థూపాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చాలన్నారు. నాడు నిజాం నవాబు,జమీందార్లు, జాగీర్‌దారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యునిస్టులదే అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తుందని ఆరోపించారు. దొడ్డి కొమురయ్య,చాకలి అయిలమ్మ అమరత్వం, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మోహినొద్దిన్ పిలుపుతో ప్రజలంతా నిజాంకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. కొన్ని పార్టీలు చరిత్రను వక్రీకరించి వారికి అనుకూలంగా మార్చుకున్నాయన్నారు. సాయుధ పోరాట యోధుల పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. సాయుధ పోరాట స్ఫూర్తితో హుస్నాబాద్ ప్రాంతంలో గౌరవెల్లి రిజర్వాయర్‌తో సహా ఎన్నో విరోచిత పోరాటాలు చేసిన ఘనత కమ్యునిస్టులేదనని, నిజమైన హీరోలు కమ్యునిస్టులు అని ఉద్ఘాటించారు. అమరుల ఆశయ సాధనలో పార్టీ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కొమ్ముల భాస్కర్, యెడల వనేష్, జేరిపోతుల జనార్ధన్, ఎగ్గోజు సుదర్శన చారీ, మిట్టపెల్లి సుధాకర్ పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల తిప్పలు

అధికారులతో రైతులు వాగ్వివాదం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామంలోని గోదాం ముందు శనివారం తెల్లవారుజామున యూరియా కోసం రైతులు బారులు తీరారు.మెట్‌పల్లి సహకార సంఘం పరిధిలోని కొత్తగట్టు గోదాంకు 450 బస్తాల యూరియా లారిలోడ్ వచ్చిందని తెలుసుకున్న రైతులు అంతకు ముందే పెద్ద ఎత్తున గోదాం ముందు బారులు తీరారు.మగవాళ్ళతోపాటు మహిళా రైతులు వేరువేరుగా క్యూలో ఉన్నారు.పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ ఆదారంగా ఏఈఓలు బస్తా రెండు బస్తాల టోకెన్లు జారి చేశారు.కొంతమంది రైతులు కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేయగా యజమాని యొక్క పట్టాదారు పుస్తకం జిరాక్స్ తీసుకువచ్చి తమకే ఇవ్వలంటూ కౌలు రైతులు వ్యవసాయశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు.భూమి ఉన్న రైతులు క్యూలో ఉంటే యూరియా అందిస్తామని అధికారులు చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.కాగా సుమారు 100 బస్తాల వరకు పక్క మండలాలకు యూరియా తరలివెళ్ళినట్లు కొత్తగట్టు రైతులు ఆరోపించారు.



## 15న అమరవీరుల వర్ధంతి

హాజరు కానున్న చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/చిగురుమామిడి:** సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆద్వర్యంలో జరుగుతున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలో భాగంగా ఈ నెల 15న చిగురుమామిడి మండలంలో పార్టీ ఆద్వర్యంలో ఇందుర్తి అమరవీరుల వర్దంతి కార్యక్రమం, సాయుధ పోరాట వారోత్సవాలను జరుపుతున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలో జరగనున్న సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హాజరవుతున్నారని తెలిపారు. ఇందుర్తి ప్రాంతంలో పార్టీ కోసం, ప్రజల కోసం ప్రాణాలర్పించిన గునుకుల జనార్దన్‌రెడ్డి, ముస్కు రాజిరెడ్డి, కూన ముత్తయ్యలతో పాటు అనేక మంది అమరవీరుల వర్దంతి కార్యక్రమం ఇందుర్తిలో జరుగుతుందని, అనంతరం పార్టీ నాయకులు ,కార్యకర్తలతో బైకు ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. బైక్ ర్యాలీ గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల మీదుగా వెళ్తూ పార్టీ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్మారక స్థూపాల వద్ద నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం మండలం నుంచి మందాపూర్‌కు వెళ్లి నిజాం రజాకార్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు మరికొంత మంది అమరులైన వారికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండలంలో జరిగే బైక్ ర్యాలీని, వర్దంతి కార్యక్రమాలను విజయవంతం చేయుటకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

## కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగేందర్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** అధిక పిజులు, రోగుల పట్ల వింత పోకడలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలను నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆద్వర్యంలో కరీంనగర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద కార్పోరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సంధర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ మాట్లాడుతూ జిల్లాలోని కార్పోరేట్ ప్రైవేట్ ఆసుపత్రులు సరైన విద్యార్హతలు లేని వారిని రిక్రూట్‌మెంట్ చేసుకుని అర్ధరాత్రి వేల యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి ఒడికట్టడం బాధాకరమన్నారు. గతంలో రెనే ఆసుపత్రిలోనూ ఇలాంటి సంఘటనే జరిగిందన్నారు. పలుమార్లు వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేదన్నారు. కార్పోరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రకరకాల పరీక్షలు, అనవసర ఆపరేషన్లతో పేద మధ్యతరగతి ప్రజల నుంచి అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఖర్చులతో పేద మధ్యతరగతి ప్రజలు ఆస్తులు అమ్ముకుంటున్నారని, ప్రతియేటా కార్పోరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు రూ.3.8 కోట్ల మంది ప్రజలను పేదరికంలోకి నెడుతున్నాయన్నారు. అల్లోపతి వైద్యవిధానంలో ఎంబిబిఎస్ చేసిన వారే వైద్యం చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ కార్పోరేట్ ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో బిఏఎంఎస్, బిహెచ్ఎంఎస్ డిగ్రీలు చేసిన వారే వైద్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎక్స్‌రేలో 28 శాతం, ఎంఆర్ఐ సిటి స్కాన్‌లో 38 శాతం అదనంగా డబ్బులు దండుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మురళి, సంతోష్, సదాశివ, సురేందర్, సత్యం, రాజు, మహేందర్, మహేష్, సన్నీ, మణికంఠ తదితరులున్నారు.

## ఆరోగ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** నిత్యం ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న హెల్త్ సిబ్బంది కూడా ఆరోగ్యంగా ఉండాలని అందుకే వారికి వ్యాక్సినేషన్ వేశామని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల ప్రభుత్వ మాత శిశు ఆసుపత్రిలో హెల్త్ కేర్ వర్కర్లకు హైపటైటీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ అందరి ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు . మాతాశిశు ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్ హెడ్ నర్స్ కమల మేరీకి ఎంఎల్ఏ వ్యాక్సినేషన్ వేశారు.

## యాజమాన్యాన్ని, కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న సర్కార్ సంఘం

ఎఐటియుసి ఆర్జి వన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణిలో యాజమాన్యం నిర్వహించిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో గుర్తింపు సంఘం ఏఐటియుసితో ఒప్పుకున్న కార్మికుల సమస్యలపై ఇంత వరకు వాటి అమలు కోసం సర్క్యులర్ లు జారీ చేయలేదని, వాటిని పరిష్కరించేంత వరకు స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో పాల్గొనబోమని శుక్రవారం హైదరాబాద్‌లో యాజమాన్యం ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాన్ని బహిష్కరించామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. శనివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం కు లేఖ రాయడం జరిగిందని, దానిపై ఇప్పటి వరకు రెండు సార్లు డైరెక్టర్ ఫా స్థాయి, ఒక సారి సి అండ్ ఎండి స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు జరిగాయని అందులో కొన్ని సమస్యల్ని అంగీకరించిన యాజమాన్యం ఇంత వరకు సర్క్యులర్ లు జారీ చేయలేదని ఆయన పేర్కొన్నారు.
ముఖ్యంగా సర్కారు సంఘం ఐఎన్టీయుసి సమస్యలు పరిష్కారం కాకుండా యాజమాన్యాన్ని, అధికారుల ను బెదిరిస్తూ అడ్డుకుంటూ ఏఐటియుసి నిబద్నాం చే స్తుందని ఆయన విమర్శించారు.సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఏఐటియుసిపై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులకు తప్పుడు సంకేతాలు ఇచ్చి ఆందోళనకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు గుర్రం ప్రభుదాస్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్, దోరగండ్ల మల్లయ్య, ప్రకాశ్, సదయ్య, సమ్మి రెడ్డి, మహేందర్ రావు, చేరాలు, రాజేశ్వరరావు,ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, పాల్గొన్నారు.

## ఇంటింటికీ సంక్షేమ పథకాలు తీసుకెళ్దాం

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రజాపాలనను పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్తశుద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ కార్పోరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా మం త్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అదే విధంగా డిసిసి అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్‌ను ఆనుకుని ఉన్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు అందరి పర్యవేక్షణలో కరీంనగర్ కార్పోరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, దీంట్లో ఎటువంటి సందేహం లేదని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని టచ్ చేయాలని, నగరంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు అర్హులకు దక్కేలా చూడాలని, బతుకమ్మ చీరల పంపిణీలో భాగస్వామ్యం కావాలని నరేందర్‌రెడ్డి సూచించారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎవ్వరైనా పార్టీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకోవాల్సిందేనని, ఎటువంటి గ్రూపులు లేవని, అందరితో కలిసి నా శక్తి మేరకు పనిచేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, లాయక్, జీడి రమేష్, పద్మ, ఖమ్రొద్దీన్, మల్లేశం, పోచయ్య, అన్ని డివిజన్ల అధ్యక్షులు, ఇంచార్జులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో వాటర్ ట్యాంక్



భయాందోళనలో స్థానిక ప్రజలు



**ప్రజాపక్షం/చొప్పదండి:** పురాతన కట్టడాలు శిథిలావస్థకు చేరి ప్రమాకరంగా మారాయి. కట్టడాలు బీటలు వారుతుండడంతో ఎప్పుడు పడిపోతాయో తెలియని ఆందోళన పరిస్థితి నెలకొంది. చొప్పదండి మండల కేంద్రంలోని 13వ వార్డులో 40సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ట్యాంకు చుట్టూ గత 25 సంవత్సరాల క్రితం టేకితం చెట్లు పెంచారు. ప్రస్తుతం పెరిగిన చెట్ల కొమ్మల వల్ల ట్యాంకు చుట్టూ పగుళ్లు ఏర్పడి ట్యాంకు నుంచి లీకవుతున్న నీళ్లు కారుతున్నాయి. చెట్లు ఏపుగా పెరగడం వల్ల ట్యాంకు చుట్టూ ఉన్న ఇండ్లలోకి మండలు చేరి ఆకులు, కాయలు రాలుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు ప్రమాదవశాత్తు కూలిపోతే దాని పరిసర ఇండ్లపై పడితే భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. శిథిలావస్థలో ఉన్న ట్యాంకు, అందులో ఉన్న చెట్లను తొలగించాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు, కరీంనగర్ ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికుడు జిట్ట కుమార్ తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల మద్యలో ఉన్న ట్యాంకు శిథిలావస్థకు చేరినప్పటికీ అధికారులు కనీసం ట్యాంకు వైపు కన్నెత్తి చూడడం లేదని, పరిశీలించి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. వర్షాకాలం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగక ముందే ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును , ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి నూతన వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరుతున్నారు.

## మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితం నాశనం చేసుకోవద్దు..




**ప్రజాపక్షం/సద్దిపేట అర్బన్:** గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందంచే కనువిప్పు కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ పిల్లలు ఏమి చేస్తున్నారో, ఎక్కడికి వెళ్లుచున్నారో గమనిస్తుండాలని తెలిపారు. ఆశ, భయం, మానవ తప్పిదాల వల్లనే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నమ్మవద్దని సూచించారు. మాధనమ్మకాలు,చేతబడులు,రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల,సామాజిక రుక్మతుల గురించి కళాబృందం నాటకాలు, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ పోలీసు సిబ్బంది,కళాబృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/వీణవంక:** కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా లోకిని స్వామి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. లోకిని స్వామిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

